అభివృద్ధి దిశగా పడుగుపాడు

నెల్లూరు నగరానికి అతి దగ్గర్లో ఉండే పడుగుపాడు మేజర్ పంచాయతీ గత టీడీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోక, దీర్ఘకాలిక సమస్యలతో ప్రజలు అష్టకష్టాలు పడేవారు. జన్మభూమి కమిటీల పెత్తనంతో అర్హులకు సంక్షేమం అందేది కాదు. అయితే 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పడుగుపాడులో అభివృద్ధి పరుగులు తీసింది. దీంతో పాటు అర్హులకు సంక్షేమ పథకాలు అందుతుండడంతో ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారు.

- మారిన గ్రామ రూపురేఖలు
- రూ.కోట్లలో సంక్షేమ పథకాల అమలు


ఇటీవల నిర్మించిన బ్రిడ్జి



కోవూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, సైడు డ్రెయిన్లు, సచివాలయ భవనాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు వెలుస్తున్నాయి. నవరత్నాల పేరుతో వివిధ వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలవుతోంది. వివక్షకు తావు లేకుండా గ్రామ వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా పారదర్శకంగా సంక్షేమాన్ని అమలు చేస్తుండడంతో అర్హులందరికీ పథకాలు అందుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రతి గ్రామంలో పర్యటించి క్షేత్ర స్థాయిలో నెలకొన్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

పడుగుపాడు బిట్-2 సచివాలయ పరిధిలో..

డీబీటీ ద్వారా లబ్ధిదారులకు జరిగిన మేలు	రూ.11.24 కోట్లు
నాన్ డీబీటీ ద్వారా లబ్ధిదారులకు జరిగిన మేలు	రూ.7.50 కోట్లు

పంచాయతీ పరిధిలో..

- పడుగుపాడు నుంచి నెల్లూరు నగరంలోని భగత్ సింగ్ కాలనీ, జనార్దన్‌రెడ్డికాలనీ, జగనన్న కాలనీ వంటి పలు వీధులకు వెళ్లేందుకు చంద్రమౌళినగర్ వద్ద ఉన్న బ్రిడ్జి ఎంతో కీలకం. గత ప్రభుత్వ హయాంలో ఈ బ్రిడ్జి నిర్మాణం గురించి పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.1.90 కోట్లతో బ్రిడ్జిని నిర్మించారు.
- గ్రామంలో దాదాపు రూ.40 లక్షలతో 20 డ్రెయి న్లను, 20 నుం చి 30 వరకు సీసీరో డ్లను నిర్మిం చారు.
- రూ.10 లక్షలతో గ్రామంలో ఎక్స్‌టెన్షన్ విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారు.
- పది ఎకరాల్లో జగనన్న లేఅవుట్‌ను ఏర్పాటు చేసి 320 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు.
- గ్రామ సచివాలయంతో పాటు రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రేరీ, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ల నిర్మాణం వేగంగా జరుగుతోంది.

చేయూత అందుతోంది



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మాలాంటి నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతోంది. ఎవరి ప్రమేయం లేకుండా వైఎస్సార్ చేయూత అందుతోంది. గతంలో ప్రభుత్వ పథకాల కోసం జన్మభూమి కమిటీల వద్దకు పరుగులు తీయాల్సి వచ్చేది. ప్రస్తుతం నేరుగా బ్యాంక్ ఖాతాలో నగదు జమ అవుతోంది. – రాజేశ్వరి, పడుగుపాడు

రూ.10 వేల పింఛన్ అందుతోంది



గతంలో ఎన్నడూ లేనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాలాంటి తలసేమియా బాధితుల కోసం ప్రతినెలా రూ.10 వేలు అందజేస్తున్నారు. ఇది కూడా వలంటీర్లు నేరుగా ఇంటికి తెచ్చి ఇస్తున్నారు. జగన్ మామయ్యకు రుణపడి ఉంటా. – మైలారి శ్యామ్, పడుగుపాడు

మా కాలనీకి బ్రిడ్జి నిర్మించారు

పడుగుపాడు పంచాయతీ పరిధిలో ఉన్న చంద్రమౌళినగర్ గిరిజన కాలనీకి కాలువ వంతెన ఇరుకుగా ఉండేది. దీంతో వాహన రాకపోకలు కష్టతరంగా ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో రూ.1.90 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. దీంతో వాహన రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి.
– సుధాకర్, మాజీ వార్డు మెంబర్

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాభివృద్ధి



మండలంలోని పడుగుపాడు మేజర్ పంచాయతీగా ఉంది. ఈ గ్రామంలో మూడు సచివాలయాలు ఉన్నాయి. ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో మౌలిక వసతుల కల్పన పూర్తి చేశాం. గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ పాలనలో జరుగుతుండడం ఆనందంగా ఉంది.
– కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, డీఎల్‌డీపీ డైరెక్టర్


నూతనంగా నిర్మించిన సీసీరోడ్డు


నిర్మాణం చివరి దశలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్

క్లుప్తంగా

ట్రై సైకిళ్ల పంపిణీ


ట్రై సైకిళ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు : కొడవలూరు మండలంలోని బాయిమిట్ట కాలనీకి చెందిన ఇద్దరు దివ్యాంగులకు ఎన్‌ఎస్సార్ ట్రస్ట్ ద్వారా ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం నెల్లూరులోని ఆయన నివాసంలో ట్రై సైకిళ్లను అందజేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమలో భాగంగా గ్రామంలో పర్యటించిన సమయంలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులు యాకసిరి పవన్‌కుమార్, కొత్తపల్లి చెంచు రమేష్‌లకు రూ.70 వేలు విలువ చేసే ట్రై సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, స్థానిక నాయకులు ఉన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని బెజవాడ బుజ్జమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు దాత కోదండరామిరెడ్డి సోమవారం పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటరత్నం మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని ముందుకు సాగాలన్నారు. ప్రణాళికాబద్ధంగా చదివి పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయుడు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిపై రౌడీషీటర్ దాడి

నెల్లూరు(క్రైమ్): మద్యం తాగేందుకు నగదు ఇవ్వలేదని వృద్ధుడిపై రౌడీషీటర్ దాడిచేసి గాయపరిచిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు..జేవీఆర్‌ఆర్ కాలనీలో రాజేశ్వరరావు నివాసం ఉంటున్నారు. ఆదివారం ఆయన పనినిమిత్తం బయటకు వెళుతుండగా అదే ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ మహేష్ అటకాయించాడు. మద్యం తాగేందుకు నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజేశ్వరరావు లేవని చెప్పగా ఆయనపై మహేష్ దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పాండురంగస్వామి అగ్నిగుండ మహోత్సవం

నెల్లూరు(బృందావనం): పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరం ఆధ్వర్యంలో పాండురంగని ఆనంద అగ్నిగుండ మహోత్సవాన్ని మంగళవారం ఉదయం 5 గంటల నుంచి బుధవారం ఉదయం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆ మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి సోమవారం తెలిపారు. సాయిదర్బార్ అద్దాల మందిరం సమీపంలోని ప్రాంగణంలో పండరి భజన గురువు లక్ష్మీసాయి ఆధ్వర్యంలో అగ్నిగుండ మహోత్సవం జరుగుతుందని వివరించారు. భక్తులు పాల్గొని స్వామివారి కరుణకటాక్షాలకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యమో? మరే ఇతర కారణమో తెలియదుకాని గుర్తుతెలియని వ్యక్తి(35) బృందావనంలోని ఓ ఆస్పత్రి వెనుక వైపు రైలు పట్టాల సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్న ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. మృతుడు బూడిదరంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, బులుగురంగు జీన్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. స్థానిక వీఆర్వో శివకుమార్ ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లి దుర్గంధం వెదజల్లుతూ ఉంది. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై నాగేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు సంతపేట పోలీసులను సంప్రదించాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

నేత్రపర్వంగా పల్లకిసేవ



నెల్లూరు(బృందావనం): నగరంలోని సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పల్లకి సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం ఉమామహేశ్వరులకు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. ఆదిదంపతులను భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా విజయ్ డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ కళాకారులు ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శన అలరించింది. ఉభయకర్తలుగా ములుమూడి చెంచుసుబ్బారావు స్మృత్యార్థం కుమారుడు బాలసుబ్రహ్మణ్యం వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : ఆటోను మోటారు బైక్ ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి క్రాస్‌రోడ్డు సమీపంలో సోమవారం జరిగింది. నెల్లూరు వైపు నుంచి గూడూరు వైపు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న మోటారు బైక్ అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వెంకటేష్‌కు గాయాలయ్యాయి. వెంటనే ప్రయాణికులు వెంకటేష్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొదలకూరు : పట్టణంలో మంగళవారం సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ శ్రీకాంత్ సోమవారం తెలిపారు. మండలంలోని దుగ్గుంట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని తెలియజేశారు. విద్యుత్ తీగల మరమ్మతుల నేపథ్యంలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

కోవూరు : గండవరంలో వెలసిన గంగాపార్వతి సమేత ఉదయకోశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే ప్రసన్న నెల్లూరులోని ఆయన నివాసంలో బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరి చలపతిరావు మాట్లాడుతూ ఈనెల 8, 9, 10వ తేదీల్లో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల మాదిరిగానే ఈ ఏడాది కూడా వైభవంగా నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక శ్రద్ధ


భద్రత ప్రతిజ్ఞ చేస్తున్న ఉన్నతాధికారులు

పొదలకూరు (ముత్తుకూరు) : తమ సంస్థలో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటున్నట్లు నేలటూరులోని ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ సంస్థ కార్యకలాపాలు–నిర్వహణాధిపతి సునీల్‌కుమార్ గుప్తా అన్నారు. ప్రాజెక్టులో సోమవారం జరిగిన 53వ జాతీయ భద్రత దినోత్సవాల్లో ఆయన పాల్గొని, ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పర్యావరణం, భద్రత, పాలన తదితర అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలు 10వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఉత్తమ పనితీరు కనబరచిన ఉద్యోగులు, సిబ్బందికి అవార్డులు ప్రదానం చేశారు. వారిచే ప్రతిజ్ఞ చేయించారు. సీఈఓ రాఘవ్ త్రివేది విజేతలను అభినందించారు.

కరాటే పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ


విజేతలతో కోచ్ ఫణీబాలాజీ

ఇందుకూరుపేట : జవహర్‌లాల్ మెమోరియల్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ఇందుకూరుపేటకు చెందిన క్రీడాకారులు విజేతలుగా నిలిచారని కోచ్ ఫణీబాలాజీ సోమవారం తెలిపారు. చిలకలూరిపేటలో ఆదివారం జరిగిన పోటీల్లో వివిధ విభాగాల్లో వీరు బ్రాంజ్, సిల్వర్, గోల్డ్ మెడల్స్ సాధించారన్నారు. ఈ మేరకు వారిని మాస్టర్ కోచ్ శ్రీనవాసరెడ్డి, తల్లిదండ్రులు అభినందించారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి


విద్యా సామగ్రిని అందజేస్తున్న ఎస్సై అజయ్‌కుమార్

మనుబోలు : విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి బంగారు భవితకు బాటలు వేసుకోవాలని ఎస్సై అజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని మడమనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆళం ఉమారాణి జ్ఞాపకార్థం ఆమె కుమారుడు, కోడలు సుమన్, అనూష అందజేసిన పరీక్ష సామగ్రిని సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డుకాదని, కృషి, పట్టుదల, అంకితభావం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ ఉంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాధాకృష్ణ, ఉపాధ్యాయుడు శివశంకర్, పీడీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

క్లెయిమ్‌ల పరిష్కారంపై చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ విజయశ్రీ

కోవూరు: ప్రతి బీఎల్‌ఓ వారి పరిధిలో వచ్చిన క్లెయిమ్‌ల పరిష్కారంపై వేగంగా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ విజయశ్రీ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల బూత్ లెవల్ అధికారులతో సోమవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చిన ప్రతి క్లెయిమ్‌ను నిశితంగా పరిశీలించాలన్నారు. అదేవిధంగా ఇతర ప్రాంతంలో ఓటు ఉన్నా మరోసారి కొత్త ఓటు కోసం నమోదు చేస్తున్నారని, అలాంటి విషయాలపై ప్రత్యేక జాగ్రత్తలు వహించాలన్నారు. అనంతరం బీఎల్‌ఓల వారీగా క్లెయిమ్‌లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్, ఎలక్షన్ డీటీ మధుసూదన్‌రావు, రవికుమార్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు పల్స్‌పోలియో


జగదేవిపేటలో ఇటుక బట్టీల వద్ద చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి

ఇందుకూరుపేట : ఐదేళ్లలోపు చిన్నారులకు నూరుశాతం పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు జగదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిశోర్ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో రెండో రోజు సోమవారం చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటుక బట్టీలు, చేపలు, రొయ్యల గుంతలు తదితర ప్రాంతాల వద్ద నివసిస్తున్న పిల్లలకు చుక్కలు వేస్తున్నట్లు తెలియజేశారు. తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

6న బాబా మందిర వార్షికోత్సవం

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిర 18వ వార్షికోత్సవం ఈనెల 6వ తేదీన జరుగుతుందని మందిర సేవాసమితి ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం 5.15 గంటలకు కాగడా హారతి, 6 గంటలకు ప్రణవ పతాకావిష్కరణ, 7 గంటలకు అభిషేక పూజలు, 9.30కు ధునిపూజ. మధ్యాహ్నం 12.30 గంటలకు తీర్థప్రసాద వినియోగం, భక్తులకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 4 గంటలకు శ్రీవిష్ణు సహస్ర నామ పూజలు, 6.15 గంటలకు సాయం సంధ్య హారతి, రాత్రి 9.30 గంటలకు శేజ్‌హారతి, తీర్థప్రసాద వినియోగంతో పూజలు ముగిస్తాయని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



కోవూరు : మండలంలోని పోతిరెడ్డిపాళెంలో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ బి.విజయశ్రీ సోమవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అన్ని పోలింగ్ కేంద్రాల్లో వసతులు తప్పక ఉండాలన్నారు. విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు అందుబాటులో ఉండేలా దృష్టి సారించాలన్నారు. ఆమె వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, సర్వేయర్ శ్రీనివాసులు రెడ్డి, వీఆర్వో రమేష్, తదితరులు ఉన్నారు.

సీఆర్సీలో వినికిడి దినోత్సవం


చిన్నారికి వినికిడి యంత్రాలను అందజేస్తున్న సంస్థ సీఆర్సీ డైరెక్టర్

వెంకటాచలం : మండలంలోని సరస్వతీనగర్ వద్దనున్న దివ్యాంగుల ప్రాంతీయ సంయుక్త కేంద్రం(సీఆర్సీ)లో అంతర్జాతీయ వినికిడి దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినికిడి లోపం ఉన్న వారికి యంత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్సీ డైరెక్టర్ మనోజ్‌కుమార్, ఫిజియోథెరపిస్ట్ రామాంజనేయులు పాల్గొన్నారు.

బీజేపీతోనే ఓబీసీ సాధికారత

నెల్లూరు(మినీబైపాస్): ఓబీసీ సాధికారత దిశగా కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పనిచేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగరాల సురేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరోమారు మోదీ సర్కార్ నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సామాజిక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా జిల్లాలోని ప్రతి గ్రామంలో బీసీ సామాజిక సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పేదల ఇళ్లపై రాజకీయాలు వద్దు


మాట్లాడుతున్న గిరిజన లబ్ధిదారులు

తోటపల్లిగూడూరు : మండలంలోని వరిగొండ పంచాయతీ జగనన్న కాలనీలో పేదల పక్కా ఇళ్ల నిర్మాణాలపై రాజకీయాలు చేయవద్దని గిరిజనులైన లబ్ధిదారులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు వరిగొండలో సోమవారం మాట్లాడారు. ఇంటి పునాదులు వేసుకునేందుకు కూడా తమకు స్తోమత లేకపోవడంతో 50 మంది లబ్ధిదారులు గ్రామానికి చెందిన గూడూరు విష్ణుమోహన్‌రెడ్డిని ఆశ్రయించామని, ఆయన ముందుగా ఇళ్ల నిర్మాణాలకు పెట్టుబడి పెట్టి బిల్లులు తీసుకునేందుకు ముందుకు వచ్చారన్నారు. ఈ మేరకు పది ఇళ్ల చొప్పున నిర్మిస్తూ వస్తున్నారన్నారు. అయితే చివరి దశలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాని కొందరి లబ్ధిదారులను గ్రామానికి చెందిన కొందరు రాజకీయ నేతలు రెచ్చగొట్టించి లేనిపోని ఆరోపణలు చేయిస్తున్నట్లు తెలిపారు. సేవాభావంతో బిల్లులతో పాటు సొంత నగదును కొంత వెచ్చించి మా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్న విష్ణుమోహన్‌రెడ్డిని రాజకీయంగా దెబ్బ తీసేందుకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇందులో ఎలాంటి వాస్తవం లేదని గిరిజనులు వెల్లడించారు.

మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న మండల విద్యాశాఖాధికారి

కోవూరు : పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ రహీమ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో సోమవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో పోలింగ్ బూత్‌లు ఉన్న పాఠశాలల్లో ఏమైనా మౌలిక వసతులు అసంపూర్తిగా ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి బాగు చేయాలన్నారు. ఎంఈఓ–2 వై.చెంచులక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రతి హెచ్‌ఎం ఆర్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అదేవిధంగా కాంప్లెక్స్ హెచ్‌ఎంలు వారి పరిధిలో ఉన్న పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. అనంతరం హెచ్‌ఎంలు రాధారాణి, వెంకటేశ్వర్లు నాయుడు, లక్ష్మీప్రసన్న, ప్రసాద్‌రెడ్డి, శ్రీహరి పలు సూచనలు చేశారు.

ఒక్కరి నేత్రదానంతో ఇద్దరికి చూపు


కామేశ్వరమ్మ బంధువులకు సర్టిఫికెట్ అందజేత

మనుబోలు : ఒక్కరి నేత్ర దానంతో ఇద్దరి అంధులకు కంటి చూపును ప్రసాదించవచ్చని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి) ఐ డొనేషన్ కౌన్సిలర్ బాలాజీసింగ్ తెలిపారు. మనుబోలు మండలం మడమనూరుకు చెందిన చప్పరం కామేశ్వరమ్మ(90) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యుల సహకారంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఐ డొనేషన్ కౌన్సెలర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. నేత్రదాత కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీసింగ్ మాట్లాడుతూ నేత్రదానం చేయాలనుకునే వారు 934711 1033, 99481 64781 నంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

25 మద్యం బాటిళ్ల పట్టివేత



తోటపల్లిగూడూరు : ప్రభుత్వ మద్యం షాపులో పనిచేసే సేల్స్ మెన్ నుంచి సెబ్ అధికారులు 25 మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. నిందితుడిని సోమవారం కోర్టుకు హాజరు పరిచారు. ఇందుకూరుపేట ఎస్‌ఈబీ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. మల్లికార్జునపురం (సాలిపేట) ప్రభుత్వ మద్యం దుకాణంలో ఈదూరు వినోద్‌కుమార్ గత కొన్నేళ్లుగా సేల్స్ మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. దుకాణ సమయం పూర్తయిన తరువాత స్వగ్రామం తోటపల్లిగూడూరులో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నాడు. ఈ నేపథ్యంలో పక్కా సమాచారంతో ఆదివారం రాత్రి తోటపల్లిగూడూరు ఆర్టీసీ బస్టాండ్‌లో 25 మద్యం బాటిళ్లతో ఉన్న వినోద్‌కుమార్‌ను సెబ్ అధికారులు పట్టుకున్నారు. సోమవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.